www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 నవంబర్ 2024
5
వైఎస్ఆర్





స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు విజయగనరం జిల్లాలో ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ప్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడాకారులు

తమ్ముళ్లకు తప్పని నిరాశ!

- నామినేటెడ్ పోస్టుల్లో కడప జిల్లాకు మొండిచేయి
- అన్నమయ్యలో 'రూపా', కెకెకు చోటు
- టిడిపి శ్రేణుల్లో నిరుత్సాహం



ముక్కా రూపానందరెడ్డి, చంద్రబాబుతో కెకె చౌదరి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రైల్వేకోడూరు

జిల్లాలోని తెలుగు తమ్ముళ్లకు నిరాశ తప్పలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు విడతలుగా విడుదల చేసిన 89 నామినేటెడ్ పదవుల్లో ఒకరికి మినహా మిగిలిన నాయకులకు చోటు దక్కలేదు. రెండో విడతపై ఆశలు పెంచుకున్న నాయకగణం తాజాగా 59 మందితో విడుదల చేసిన రెండో విడత జాబితాలో చోటు లభించకపోవడంతో నిరుత్సాహం నెలకొంది. కడప జిల్లాకు చెందిన నాయకులకు మొండిచేయి చూపించింది. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డికి అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, అదే నియోజకవర్గంలోని చిట్వేలి మండలానికి చెందిన కె.కె.చౌదరికి ఏపి ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ పదవులు కట్టబెట్టడం మినహా ఎటువంటి ప్రయోజనమూ లభించలేదు. రాష్ట్రంలో అప్పటి అధికార వైసిపిని ఎదుర్కోవడంలో భాగంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడిన సంగతి తెలిసిందే. కూటమి ఏర్పాటులో టికెట్లను త్యాగం చేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఊరడించారు. అటువంటి గుర్తింపు ఛాయలే కనిపించకపోవడంతో ఆశావహులకు నిరాశ తప్పలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆర్నెళ్లుగా టిడిపి కార్యకర్తలే టార్గెట్‌గా సాగిన వైసిపి దాడుల్లో వందలాది మంది కార్యకర్తలు తీవ్రంగా నష్టపోయారు. వైసిపి కేడర్ చేతిలో నష్టపోయిన కార్యకర్తలను ముందుగా ఆదుకోవాల్సిన నాయకత్వం పలుకుబడి కలిగిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం నిరాశ కలిగిస్తోంది. తాజాగా కూటమి నాయకత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో కడప జిల్లాకు ఎవరికీ చోటు లభించకపోవడం గమనార్హం. మొదటి విడత జాబితాలో 20 కార్పొరేషన్ స్థాయి పదవుల్లో డైరెక్టర్ స్థానాలకు పరిమితమైన నాయకులు తిరస్కరిస్తూ అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ఏర్పాటులో భాగంగా మిత్రులకు టికెట్లను త్యాగం చేసిన వారిలో ఉమ్మడి జిల్లాలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఉన్నారు. జమ్మలమడుగు టికెట్ కోసం చివరి వరకు పోరాడిన భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు టికెట్ కోసం హోరాహోరీగా తల పడిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైల్వేకోడూరు టికెట్ త్యాగం చేసిన పంతగాని నరసింహప్రసాద్, రాజంపేట టికెట్ త్యాగం చేసిన బత్యాల చెంగల్రాయుడు, కడపలో మైనార్టీ టికెట్‌ను సైతం వదలుకున్న సీనియర్ నాయకులు అమీర్‌బాబు వంటి నాయకులు, పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన సీనియర్ కార్యకర్తలు, నాయకులకు తీవ్ర నిరాశను కలిగించింది. వీరితోపాటు టికెట్లు ఆశించిన స్థాయిన కలిగిన సీనియర్ నాయకులు సైతం ఉన్నారు. ఇటువంటి వారిలో ఏ ఒక్కరికీ నామినేటెడ్ పోస్టుల్లో చోటు లభించకపోవడం విస్మయాన్ని కలి గించింది.

దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం ఎల్ఐసి

- 14న కడపలో కళాజాత

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ బలమైన ఆర్థిక వ్యవస్థకు ఎల్ఐసి కీలకమని ఉద్యోగుల సంఘం నాయకులు ఎ. రఘునాథరెడ్డి, చంద్రపాల్, సుధీర్, నిత్యానందరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 14న ఎల్ఐసి యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆట-పాట-మాట (కళాజాత) కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఎల్ఐసి కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు అవధాని శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులో జరిగే యూనియన్ జోనల్ మహాసభ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు 4 రోజులపాటు 25 మంది ఎల్ఐసి సిబ్బందితో కూడిన కళాకారుల బృందం కడపకు 14న చేరుకుని కళారూపాల ప్రదర్శన ఇస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల భవిష్యత్తు ప్రజా ధారమని చైతన్యాన్ని పెంచడం ఈ కళాజాత ఉద్దేశమని అన్నారు. ఆర్థిక సంక్షోభ సమయాల్లో దేశాన్ని ఆదుకున్నది ఎల్ఐసి, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలే అని అన్నారు. ఆహార ధాన్యాల స్వయం సమృద్ధికి, ఉపాధి కల్పనకు కారణమైన రైతాంగానికి, వృత్తిదారులకు ఆర్థిక మద్దతు అందించేది ప్రభుత్వ రంగ బ్యాంకులేనని అన్నారు. పోస్టల్, టెలికం, రైల్వే, ఆయిల్, విద్యుత్, రవాణా, స్టీల్ రంగాలకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు లేని దేశాన్ని, దాని ఆర్థిక స్వావలంబనను మనం ఊహించుకోలేమని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను చాలా కళాత్మకంగాను, ఉద్వేగభరితంగాను, చైతన్య పూరితంగానూ ప్రదర్శించే కళాజాత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు అక్బర్, అమీనా పర్వీన్, శ్రీనివాసులు (ఇన్సూరెన్స్), శ్రీనివాసులు రెడ్డి, మనోహర్ (సిఐటియు), రాజమణి (మహిళా రంగం), రామకృష్ణారెడ్డి (పెన్షనర్స్), సుదర్శన్ రెడ్డి (విద్యుత్), కుమారస్వామి (మేధావుల సమాఖ్య) లక్ష్మీ రాజా, మహేష్, గునిశెట్టి శ్రీనివాసులు (ఉపాధ్యాయ), లలిత, అజీజ్, జగదీష్ (బ్యాంకింగ్), సుబ్బారెడ్డి, రమణయ్య (పోస్టల్), రామాంజుల రెడ్డి (మెడికల్ రెప్), రాజు (సిరికల్చర్), వెంగల్ రెడ్డి, సుబ్బరామయ్య (మెడికల్) రంగాల నేతలు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి, వివిధ సంఘాల నాయకులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - కడప అర్బన్

నాగార్జున మ హిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వ హించారు. ముఖ్య అతిథిగా వైవీయూ రిజి స్ట్రార్ పి.పద్మా, గౌరవ అతిథులుగా ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సి పల్ సూర్యారావు, కళాశాల కరస్పాండెంట్ బి.రామకృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్ బి.ఎస్.వి.మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కె. రెడ్డప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాటాడుతూ కుటుంబం ముందుకు వెళ్లాలంటే మహిళ ప్రాధాన్యం ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు విద్యా, సామాజిక, రాజకీయంగా ఎదగాలని తెలిపారు. 33 ఏళ్ల నుంచి మహిళా కళాశాల కొనసాగుతోందని చెప్పారు. కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థిని విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ మాట్లా డుతూ చరిత్రలో మహిళలను మగవారి ఆస్తిగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. సభ అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రిజిస్ట్రార్ చేతుల మీదగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్య, గాన, నాటక ప్రదర్శన అబ్బురపరిచాయి.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కడప



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఫాతిమా ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ యాజమాన్యం సెక్రటరీ జవాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో శనివారం నందిమండలం గ్రామం హై స్కూల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఇఎన్‌టి, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించిన వైద్య సేవలు అందించారు. కార్యక్రమానికి నంది మండలం, పరిసర ప్రాంతాల నుంచి సుమారు 250 మందికి పైగా ప్రజలు హాజరై ఉచిత వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

జుగుప్సాకరం

ప్రజాదృష్టి

కడప కార్పొరేషన్‌లో కుర్చీ రాజకీయం జుగుప్సను కలిగిస్తోంది. గత సర్వసభ్య సమావేశాన్ని ఎమ్మెల్యే పెద్దఎత్తున అనుచరులతో నింపేయడం చర్చనీయాంశమైంది. అనంతర రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా మేయర్ ఇంట్లో ఎమ్మెల్యే అనుచరులు చెత్త రాజకీయం వేయడంతో అపరిణిత రాజకీయానికి తెరలేసింది. హుందా రాజకీయాల స్థానంలో అగ్రెసివ్ రాజకీయం చేయడం విమర్శలకు దారితీసింది. ఏ రాజకీయం చేసిన ప్రజా సమస్యలే ఆలంభన ఉండాలి. ఇందుకు విరుద్ధంగా వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ముందుకెళ్లడం శోచనీయం. కార్పొరేషన్ పాలకవర్గం సర్వసభ్య సమావేశానికి హాజరవుతున్న మహిళా కార్పొరేటర్లకు భద్రత కల్పించాలని ఎస్‌పిని కలిసి విజ్ఞప్తి చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రొటోకాల్ పేరుతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కార్పొరేటర్ల సరసన కుర్చీలు ఏర్పాటు చేయడం అగ్నికి ఆజ్యంపోసింది. గతంలో వైసిపికి చెందిన ఎమ్మెల్యేలకు వర్తించని ప్రొటోకాల్, టిడిపి ఎమ్మెల్యేలకు వర్తించకపోవడం గమనార్హం. తేడా ఏమిటంటే వైసిపి ఎమ్మెల్యేల అనుచరులు ఇంతటి స్థాయిలో సమావేశంలోని కుర్చీలను ఆక్రమించకపోవడమే. ఎత్తుకు పెఎత్తుగడల రాజకీయాలతో ప్రజా సమస్యలు గాలికిపోవడం విస్మయాన్ని కలిగించింది. కడప ఎమ్మెల్యే ప్రజా సమస్యల పేరుతో అజెండాను భేఖాతరు చేస్తూ ప్రసంగాన్ని కొనసాగించడం, మేయర్ ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా రాజకీయానికి వాడుకోవడం హేయనీయం. ఎజెండా ఫాలో అవుదామని కోరిన మేయర్‌తో వాగ్వివాదానికి దిగడంతో కార్పొరేటర్లు, మేయర్ భాయ్ కాట్ చేసి వెళ్లిపోవడంతో ప్రజాసమస్యలు చర్చకు రాకుండా పోయింది. కమిషనర్ ఎమ్మెల్యే కనుసన్నల్లో మెలగడం రాజకీయాన్ని తలపించింది. ప్రజా సమస్యలను చర్చించాల్సిన కార్పొరేషన్ నాయకత్వం రాజకీయానికి వాడుకోవడం ఆందోళనకరం. ర్యాటిఫికేషన్‌పై పనులు చేయడాన్ని తప్పుబట్టిన ఎమ్మెల్యే విచారణ చేయించి వాస్తవాలను నిగ్గుతేల్చాలి. మూడు నెలలుగా విచారణ చేయించకుండా ఎవరు ఆపారో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇంతటితో ఆగకుండా 2024 సార్వత్రిక ఎన్నికల్లో తనకు మేయర్ సహకరించారనే అంశాన్ని వెలుగులోకి తీసుకు రావడంలోని మర్మమేమిటో తెలియడం లేదు. ఎన్నికల్లో ప్రత్యర్థి నాయకులు ఎవరైనా సహకారం అందిస్తే కృతజ్ఞతను కలిగి ఉండాలి. సహకరించిన వారి పేర్లను గుప్తంగా ఉంచాల్సిన కనీస బాధ్యత లబ్ధిదారునిది. ఇటువంటి కనీస ధర్మాన్ని సైతం రాజకీయం చేయడంలోని ఔచిత్యమేమిటో తెలియడం లేదు. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యేకు ఎటువంటి సహకారం అందించలేదనే పేరుతో మేయర్ దిద్దుబాటు చర్యలకు దిగినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయిందని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉచిత న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కడప : ఎటువంటి రుసుం లేకుండా న్యాయ సేవలను అందించడమే న్యాయ సేవల దినోత్సవ లక్ష్యం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కడప కోర్టు ఆవరణం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ సర్కిల్ చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. తిరిగి అక్కడి నుంచి కోర్టు ఆవరణం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు న్యాయ సేవల దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

ఆ ఇద్దరి వల్ల నగరంలో భయానక వాతావరణం : మేయర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రశాంతతకు, శాంతికి చిరునామాగా ఉన్న కడప నగరం ఆ ఇద్దరి వల్ల భయానక వాతావరణం అలుముకుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవిని ఉద్దేశించి మేయర్ సురేష్ బాబు వ్యాఖ్యానించారు. శ్రీనివాసరెడ్డి ఆరోపణలను ఖండిస్తూ దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత మేయర్ ప్రమాణం చేశారు. అనంతరం దేవస్థానం వెలుపల మీడియాతో మాట్లాడారు. టిడిపి నుంచి డబ్బు తీసుకున్నట్లు నిందారోపణలు చేయడం సరికాదన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు తాను చేస్తున్నానని తెలిపారు. రూ. 3 కోట్లు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని స్పష్టం చేశారు. శ్రీనివాసరెడ్డి మేయర్ మూడు కోట్లు తీసుకున్నారని చెప్పి మళ్లీ మాట మార్చడం దేనికి నిద ర్శనం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మాజీ సిఎం అంజాద్ బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సావిత్రి నియామకం హర్షణీయం

ప్రజాశక్తి - కడప : మొదటిసారిగా మహిళనాయకులు సావిత్రిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం ఎంతో హర్షించదగ్గ విషయమని కడప జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి అన్నారు. ఓ మహిళను రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన సావిత్రికి ఈ సందర్భంగా రజక నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు స్థాపించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ :



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు స్థాపించాలని జాతీయ ఉర్దూ సెమినార్‌లో ప్రధాన భక్తులు పేర్కొన్నారు. శనివారం అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఉర్దూ సెమినార్‌కు చైర్మన్ సత్తార్ ఫైజి అధ్యక్షత వహించగా కన్వీనర్‌గా సయ్యద్ హిదాయతుల్లా వ్యవహ రించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, జాతీయ ఉర్దూ సెమినార్ చీఫ్ ప్యాటర్న్ అమీర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హాజరై ప్రసంగించారు. ఉర్దూ భాషాను కాపాడాల్సిన, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు వెంటనే స్థాపించేందుకు కృషి చేస్తా మని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.అతిథులందరూ కలిసి పలు పుస్తకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాతిమా మెడికల్ కళాశాల కరస్పాండెంట్ జవ్వాద్, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, సీనియర్ నాయకులు అష్రఫ్ అలీ ఖాన్, నజీర్ అహ్మద్, టిడిపి నాయకులు జిలానీ బాషా, అధ్యాపకులు డాక్టర్ సత్తార్ సాహిర్, డాక్టర్ అమీనుల్లా, డాక్టర్ అయూబ్ హుసేన్, షఫీవుల్లా ఖాన్, పెద్ద సంఖ్యలో ఉర్దూ భాషాభిమానులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. రక్తపరీక్షలు, ఫార్మసీ విభాగాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మితమవుతున్న కేంద్రీకృత రక్తపరీక్షల భవనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, డాక్టర్ హర్షిత, ఆరోగ్య అధికారి సుకుమారన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను పరిరక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రాథమిక విద్యను పరిరక్షించాలని ఆర్‌జెయుపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్ అన్నారు. శనివారం రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం భుజంగ రావు స్మారక టీచర్స్‌హోంలో రాష్ట్ర అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్య రంగం క్రమేణా బలహీనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు రోజు రోజుకూ పెరుగుతుండటం విద్య రంగానికి మంచిది కాదన్నారు. సెకండరీ, ఉన్నత విద్యకు ప్రాథమిక రంగం పునాది అన్నారు.

అవినాష్‌రెడ్డి పిఎ అరెస్టుకు చర్యలు

రాత్రంతా ఇంటి వద్ద పోలీసుల పడిగాపులు
విషయం తెలుసుకొని ఇంటికి రాని పిఎ రాఘవరెడ్డి



పోలీసులతో మాట్లాడుతున్న వైసిపి లీగల్ అడ్వయిజర్, ఎంపీ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి (ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి అరెస్టు చేయడానికి శుక్రవారం రాత్రంతా ఆయన ఇంటి వద్ద పోలీసులు పడిగాపులు కాశారు. విషయం తెలుసుకున్న రాఘవ రెడ్డి ఇంటికి రాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన అవినాష్ రెడ్డి ముఖ్య అనుచరుడు వర రవీంద్రారెడ్డిని ఇదివరకే పోలీసుల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రాతో రాఘవరెడ్డి చాటింగ్ చేసినట్టు సమాచారంతో పోలీసులు అరెస్ట్ చేయడానికి వచ్చినట్టు తెలుస్తుంది. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం రాఘవ ఇంటి దగ్గరకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. రాఘవరెడ్డిని ఎక్కడ ఉన్నారో చెప్పాలని తండ్రి అడిగినట్టు సమాచారం. వైసిపి లీగల్ అడ్వైజర్ ఓబుల్‌రెడ్డి రాఘవ రాగానే సమాచారం ఇస్తామని తెలపడంతో పోలీసులు వెళ్ళిపోయారు. రాఘవరెడ్డి వస్తే నోటీసులు ఇస్తారా, అరెస్ట్ చేస్తారా అన్న సందిగ్ధం నెలకొంది.

వైసిపి శ్రేణుల్లో టెన్షన్.. టెన్షన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పిన క్షణం నుంచి పోలీసులు అరెస్టులు ప్రారంభించారు. ఇందులో పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం కొండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్య అనుచరుడు వర్రా రవీంద్రారెడ్డిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎంపీ అవినాష్ వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి అరెస్ట్ చేయడానికి శుక్రవారం ఆయన ఇంటి వద్ద పడిగాపులు కాయడంతో వైసిపి శ్రేణులలో టెన్షన్ మొదలైంది. మరి ఎంతమందినో అరెస్టు చేస్తారా అన్న టెన్షన్‌తో వైసిపి శ్రేణులున్నారు. ఏది ఏమైనప్పటికీ వైసిపి శ్రేణులు ఈ విషయంపై భయాందోళనలో ఉన్నారని చెప్పవచ్చు.

'వర్రా'కు వైసిపి నుంచే ప్రాణహాని : బిటెక్ రవి

ప్రజాశక్తి పులివెందుల టౌన్ : వర్రా రవీంద్రారెడ్డికి వైసిపి నుంచే ప్రాణహాని ఉందని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారేడు రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం ఒక వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీంద్రకు ప్రాణ హాని కలిగించి ఆ నేపాన్ని ఆంధ్రా పోలీసుల మీద, టిడిపి కూటమి మీద నింద వేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రయోజనాల కోసం సొంత మనుషులనే చంపే చరిత్ర ఉందన్నారు. వర్రా రవీంద్రా విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డినికి అదుపులోకి తీసుకొని విచారణ చేయాలని తెలిపారు. గతంలో వివేకానందరెడ్డి హత్య కేసులో కూడా కీలకపాత్ర అతనిదేనని చెప్పారు. వర్రా రవీంద్ర , అవినాష్ పిఎ రాఘవ రెడ్డితో ఫోన్ టచ్‌లో ఉన్నాడని పోలీసులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన అదుపులోకి తీసుకోలాన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడొద్దు : ఎంపీ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ : అక్రమ అరెస్టులకు వైసిపి కార్యకర్తలు, నాయకులు భయపడొద్దని కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసులు చట్టప్రకారం నడు చుకోవాలని, రౌడీల్లా వ్యవహరిస్తూ అర్ధరాత్రులు లాఠీలతో తలుపులు కొట్టడం భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని పేర్కొన్నారు. తప్పు చేసి ఉంటే చట్టప్రకారం అరెస్టు చేయాలని పేర్కొన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్రా రవీంద్రారెడ్డిని అరెస్టు చేసినట్లు పచ్చ మీడియాలోనే వచ్చిందని, ఇంతవరకు అధికారికంగా చూపించకుండా పోలీసుల అదుపులో పెట్టుకొని చిత్రహింసలు చేయడం సరైంది కాదని తెలిపారు. ఇప్పటికైనా అతని అరెస్టును చూపించి కోర్టుకు హాజరు పరచాలని, లేకపోతే విచారించి సమాచారం తీసుకొని పంపించాలన్నారు. శుక్రవారం రాత్రి తన పిఎ ఇంటికి వెళ్లి డోర్లపై లాఠీలతో కొట్టడం ఏమిటి అని ప్రశ్ని ంచారు. వైసిపి నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులు చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఎన్నో కుట్రలు కుతంత్రాలు చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో వందల అరెస్టులు చేస్తారని, వైసిపి నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, పోలీసులు చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. పులివెందుల టిడిపి నాయకులు బిటెక్ రవి, వర్రా రవీందర్‌రెడ్డి అరెస్టుకు సంబంధించి మాట్లాడడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.

ప్రయివేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : పట్టణంలోని ప్రయివేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, ఎస్.కె. ఆదిల్, బద్వేల్ రూరల్ అధ్యక్ష ,. కార్యదర్శులు ముడ మాల ఓబుల్‌రెడ్డి, ఉప్పులూరు బాల గురవయ్యతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో ఉన్న ప్రయివేట్ ఆసుపత్రుల వైద్యులు, యాజమాన్యాలు అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. చిన్నపాటి అనా రోగ్యంతో వచ్చిన పేదలను రకరకాల పరీక్షల పేరిట నిలువు దోపిడీ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రయివేట్ ఆస్పత్రుల వైద్యులు అర్హత లేకున్నా అక్కడ పనుచేస్తున్న నర్సులతో వైద్యం అందిస్తున్నారని వాపోయారు. మామూలు కాన్పులు అవుతున్నప్పటికీ ఏదో కారణం చెప్పి సిజేరియన్ చేస్తూ వేలకు వేలు వసూతు చేస్తున్నారని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేపడుతామని వారు హెచ్చరించారు.

విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలాపన పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప బాలోత్సవం ఆధ్వర్యంలో శనివారం బాలాజీ నగర్ లోని ఎస్.వి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వేమన సుమతి శతక పద్యాలాపన పోటీలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కడపలోని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ జూనియర్ విభాగం నుంచి వ్యాసరచనకు 180 మంది, పద్యాలాపన 225 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం ఉపాధ్యక్షులు నాగ ముని రెడ్డి, బాల ఎల్లారెడ్డి, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు లక్ష్మీరాజా జెవివి నాయకులు శివరాం, సునీత, అరుణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాల చేత డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయడం తగదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఒక్క డిఎస్‌సి కూడా వదలకుండా నిరుద్యోగులను మోసం చేయడంతో నిరుద్యోగులు విసిగి వేసారి ఉద్యోగాల కోసం మార్పు కోసం రాష్ట్రంలోని నిరుద్యోగులు గంపగుత్తగా కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించడంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కూడా అదిగో,ఇదిగో డిఎస్సీ నోటిఫికేషన్ అంటూ ఊరుస్తుందన్నారు.

నగరంలో ఎక్కడి సమస్యలు అక్కడే : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలో పలు చోట్ల ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సిపిఎం నగరం మహాసభలు ఈనెల 30న రామకృష్ణ నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద, ప్రజలపై మోపిన భారాలకు వ్యతిరేకంగా సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నగర సమగ్ర అభివృద్ధి కోసం రూ.2,400 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామని గొప్పలు చెబుతున్నా మురికివాడల్లో నివాస ప్రాంతాలు అభివృద్ధి చెందలేదన్నారు. నగరంలో విలీనమైన పంచాయతీలలో మౌలిక వసతులు కల్పించడంలో నగర కార్పొరేషన్ పాలక యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. రానున్న కాలంలో నగర సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం ఆందోళన, పోరాటాలను రూపొందించేందుకు నగర 6వ మహాసభలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ మహాసభకు నగరం ప్రజానీకం సహాయ సహకారాలు అందించాలని కోరారు.

అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చేయాలి : పిసిసి

ప్రజాశక్తి - కడప : మాజీ సిఎం జగన్ అసెంబ్లీ కైనా వెళ్లాలని, లేదా రాజీనామా అయినా చేయాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధ్యక్షులు, పులివెందుల శాసనసభ్యుడు జగన్, ఆ పార్టీ శాసన సభ్యులు ఈ నెల 11 నుంచి నిర్వహించబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకూడదని, బహిష్కరించాలని నిర్ణయించడం శోచనీయం, దురదృష్టకరమని అన్నారు. ఈ చర్యఅసెంబ్లీని అవమాన పరచడమే అవుతుందన్నారు.సమావేశంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి మాజీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, అబ్దుల్ సత్తార్, శ్యామలమ్మ, సిరాజుద్దీన్, మైనుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, సంజయ్ కాంత, మహబూబ్ బాషా, శీలం గంగయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- కమలాపురం టౌన్ : రాష్ట్రస్థాయి పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలను స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం టిడిపిరాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు కమలాపురంలో ఆతిథ్యమిస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో కష్టపడి ఇంత దూరం వచ్చిన బాలికలకు, వారి తల్లిదండ్రులకు కూడా అభినందనలు తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని చెప్పారు. క్రీడల్లో అత్యున్నత స్థాయి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని కళాశాల యాజమాన్యాన్ని టోర్నమెంట్ ఆర్గనైజర్లను ఆయన కోరారు.



మాట్లాడుతున్న జడ్జి భార్గవి

న్యాయ సేవలు పొందితేనే సామాజిక న్యాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అట్టడుగు వర్గాల వారు న్యాయ సేవలు పొందినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. శనివారం న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవారికి, బలహీన, వెనుకబడిన తరగతుల వారందరికీ న్యాయం అందుబాటులో ఉండాలని సుప్రీంకోర్టు 1995 నవంబర్ 9న న్యాయ సేవల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. మానవ అక్రమ రవాణా చేయడం చట్టవ్యతిరేకమన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండేలా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి సమాజాన్ని చైతన్య పరచాలని జడ్జి న్యాయవాదులను కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆహార నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గర్భిణులు ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేయాలని పిహెచ్‌సి వైద్యాధికారి కరిష్మా సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో శనివారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని,వైద్యుల సలహాలు పాటించాలన్నారు. ఆకుకూరలు, ఖనిజ లవణాలు, కొవ్వు పదార్థాలు, ప్రొటీన్స్ ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. నడవడం చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా, సుఖ ప్రసవం అవుతుందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ జాస్మిన్ గర్భిణులకు పలు పరీక్షలు చేశారు. 36 మందిని పరీక్షించగా, వీరిలో 9మందికి ప్రమాదకరంగా ఉందని గుర్తించారు. ప్రసవం కోసం ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. కాన్పు కోసం 108, 102 వాహనాలను ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సుఖమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి శ్రీ వాసరెడ్డి, సూపర్‌వైజర్ శోభా కుమారి, ఫార్మసిస్ట్ జగదీశ్, ఎఫ్‌ఎన్‌ఒ రిషిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫైల్ పరిశీలిస్తున్న డాక్టర్ కరిష్మా

కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం

- డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శాంతికళ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమని, జబ్బు రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శాంతికళ తెలిపారు. స్థానిక దన్నవూరు యూపిహెచ్‌సిలో శనివారం ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలకు యూనివర్సల్ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల14 నుండి ప్రారంభం కానున్న సర్వేపై అవగాహన ఉండాలన్నారు. జబ్బు రాకముందే జాగ్రత్తలు పాటిస్తే రోగాలకు స్వస్తి పలకవచ్చన్నారు.సర్వేలో ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్లు దాటినవారికి ఎత్తు, బరువుతోపాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. డాక్టర్ సలహా మేరకు మందులు పంపిణీ చేయాలని తెలిపారు. ముందస్తు పరీక్షలు అవగాహన వల్ల వ్యాధి రాకుండా జాగ్రత్త పడవచ్చునని సూచించారు. సమావేశంలో డాక్టర్ తాహెరా, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శాంతికళ

18 ఏళ్లు పైబడిన వారికి స్క్రీనింగ్ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె



మాట్లాడుతున్న వైద్యురాలు స్వాతిసాయి

కేన్సర్ నివారణ కోసం ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులకు స్క్రీనింగ్ చేయాలని ప్రభుత్వ వైద్యురాలు స్వాతి సాయి సూచించారు. శనివారం కేన్సర్ అవగాహనపై ఆశాలకు పిహెచ్‌సి సిబ్బందికి శిక్షణ నిచ్చారు. ఈనెల 14 నుంచి నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారం కేన్సర్‌కు సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తద్వారా కేన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రజలకు కూడా అందుకు సహకరించాలని ఆమె కోరారు. పలు సూచనలు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నిషా బేగం, సూపర్‌వైజర్లు పక్కీరన్, వెంకటలక్ష్మమ్మ, అరుణాదేవి, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హిమబిందు సూచించారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోని బాలికల వసతి గృహంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బాలికలకు వైద్య చికిత్సలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలికలు పీరియడ్స్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎస్‌యుఓ సాధు శ్రీనివాసులు మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. 65మంది బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులిచ్చారు. వసతిగృహ అధికారులు ఉమాదేవి, మనోరాణి, సుబ్బారెడ్డి, జ్యోతి, దినేష్, ఆశ, పుష్పకుమారి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

12 రేషన్ బియ్యం బస్తాలు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

పట్టణంలోని చింతలమడుగుపల్లె సమీపంలో 12 రేషన్ బియ్యం బస్తాలను పట్టుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. అందిన సమాచారం మేరకు శనివారం సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బందితో ఎస్ఐ రంగారావు దాడులు చేశారు. చింతలమడుగుపల్లె గ్రామ సమీపంలో ఉన్న జగనన్న కాలనీ వద్ద కదిరి టౌన్‌కు చెందిన షేక్ అక్రమ్‌బాషా, సలీం బాషా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. టాటా సుమో, ఆటోలను స్వాధీనం పరుచుకొన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

48 చీనీ చెట్లు నరికివేత

ప్రజాశక్తి - ముద్దనూరు

మంగపట్నం గ్రామానికి చెందిన బోడెద్దుల బయపురెడ్డి తన 4.92 ఎకరాల భూమిలో నాటుకున్న చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బయపురెడ్డి చీనీ తోటలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా వెళ్లి 48 చీనీ చెట్లను నరికినట్లు చెప్పారు. దాదాపు రూ.10వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడన్నారు. అదే గ్రామానికి చెందిన బోడెద్దుల గోపాల్‌రెడ్డి, నాగశేఖర్‌రెడ్డిపై అనుమానం ఉన్నట్లు బయపురెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

నాణ్యతలేని పనులు.. ప్రజాధనం వృథా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నాణ్యతలేని పనుల కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అని, రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడంలేదని ప్రజల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. పట్టణ సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వంలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించారు. ఆ పనులలో అధికారులు నాణ్యత గురించి పట్టించుకోకుండా కాంట్రాక్టర్లతో పనులు చేయించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా పులివెందుల పట్టణంలోని కదిరి రింగ్ రోడ్డులో గాలికే కూలిపోయిన విద్యుత్ స్తంభాలే అని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజలు నడిచే రహదారిలో స్తంభాలు ఏర్పాటు చేశారని, అవి పడే సమయంలో అక్కడ ఎవరూ లేక ఎలాంటి ప్రమాదం జరగలేదంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో వారి జేబులు నింపుకోవడం కోసమే కాంట్రాక్టర్లతో ఇలా నాణ్యతలేని పనులను చేయించి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారంటున్నారు. రింగ్ రోడ్డు చుట్టూ నిర్మించిన విద్యుద్దీపాలు రెండు నెలలుగా వెలగడం లేదని ప్రజలు అంటున్నారు. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా వారు స్పందించడం లేదని వాపోతున్నారు. ఇటు మున్సిపల్ అధికారులకు చెబితే ఇంకా ఆర్అండ్‌బి అధికారులు తమకు అప్పగించలేదని అంటున్నారు. ఆర్అండ్‌బి అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అర్థమవుతోంది. డివైడర్లలో అందమైన పూల మొక్కలు వేస్తే అందులో ప్రస్తుతం ముళ్లపొదలు వేపుగా పెరుగుతున్నాయని, కనీసం వాటిని తొలగించాలన్న ఆలోచన కూడా అధికారుల్లో లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆ ముళ్లపొదలు ఇంకా వేపుగా పెరిగితే వాటిని తొలగించడం సాధ్యం కాదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా డివైడర్ లోపల ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించి పూల మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఎమ్మెల్యే 'ఆది'తోనే నియోజకవర్గ అభివృద్ధి

- వేల్పుచెర్ల గ్రామ నాయకులు చప్పిడి రామాంజనేయరెడ్డి(బాబు)

ప్రజాశక్తి - ముద్దనూరు



జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే సి.ఆది నారాయణరెడ్డితోనే సాధ్యమని ఎన్‌డిఎ కూటమి నాయకులు వేల్పుచెర్ల గ్రామ నాయకులు చప్పిడి రామాంజనేయరెడ్డి(బాబు) అన్నారు. ఆ మేరకు ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి,, ఎమ్మెల్యే ఆది జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలి పారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే జమ్మలమడుగులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి, ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు జరిపి పేద ప్రజలకు ఉచితంగా మందులు అందజేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి మెగా జాబ్‌మేళా నిర్వహించారన్నారు. మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు గండికోట జలాశయం ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండలానికి నీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ప్రతి గ్రామానికి సిసి రోడ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారన్నారు. ముద్దనూరు మండల నాయకులు సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే ఆది, మధుసూదనరెడ్డి సహాయ సహకారాలతో వేల్పుచెర్ల గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరువ చేసేందుకు పాటుపడతానని ఆయన వివరించారు. గ్రామ పంచాయతీ ప్రజల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తానని రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో ఉబైద్ ఉత్తమ ప్రతిభ



ఉబైద్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రైఫిల్ షూటింగ్‌లో తమ విద్యార్థి మహమ్మద్ ఉబైద్ చిచ్చర పిడుగని రాజేశ్వరి కాలనీ శ్రీచైతన్య స్కూల్ ఏజిఎం నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికైన సందర్భంగా ఉబైద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ షేక్ మహమ్మద్ ఉబైద్ 2024 అక్టోబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి డిశంబర్‌లో జరుగబోవు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఒలంపిక్స్‌లో ఎంపికై ఖచ్చితంగా దేశానికి గర్వకారణమవుతాడన్నారు. రైఫిల్ షూటింగ్ క్రీడల్లో ప్రావీణ్యం పొంది మూడేళ్లలో 9 స్వర్ణపతకాలు సాధించాడని తెలిపారు. 2022లో రైఫిల్ షూటింగ్ సంఘం ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 2 బంగారు పతకాలు, 2022లో ఎస్‌జిఎఫ్ఐ వారు రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ఓపన్‌సైట్ అండర్-19 విభాగంలో బంగారు పతకం సాధించి 2023లో ఢిల్లీలో జరిగే నేషనల్స్‌కు ఎంపికయ్యాడన్నారు. 2024లో రాష్ట్రస్థాయి పోటీలలో ఓపెన్ విభాగంలో సబ్‌యూత్, యూత్ జూనియర్-మెన్, మెన్ విభాగంలో 4 బంగారు పతకాలు, 2024లో ఎస్‌జిఎఫ్ఐ వారు రాజమండ్రిలో నిర్వహించిన పోటీలలో ఓపన్ సైట్ అండర్-17 విభాగంలో బంగారు పతకం సాధించి భోపాల్‌లో జరిగే నేషనల్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అభినందన సభలో కో-ఆర్డినేటర్ మురళి, ప్రిన్సిపల్ వినోద్ కుమార్, ఇన్‌ఛార్జి విశ్వనాథ్, సుధర్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

- డివిజన్ స్థాయిలో బహుమతి

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప జిల్లా రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రొద్దుటూరు డివిజన్ స్థాయిలో నిర్వహించిన వేమన పద్య పోటీల్లో ముద్దనూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 450 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో 13 మంది జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఇందులో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 9వ తరగతికి చెందిన ఎం.మౌనిక, గంగా జగదీశ్వరీ, 8వ తరగతి జి.సుమ అఖిల జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో సుమఅఖిల మూడవ స్థానంలో నిలిచి రూ.2వేలు నగదు బహుమతి గెలుపొందినట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో బహుమతులు గెలుపొందాలని ప్రధానోపాధ్యాయులు ఆకాక్షించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



బహుమతి గెలుపొందిన విద్యార్థులతో ఆవుల శ్రీనివాసులు



జరిమానా విధిస్తున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి - వేంపల్లె

వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్సులతోపాటు అందుకు సంబంధించిన పత్రాలు తప్పక కలిగి ఉండాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. శనివారం సాయంత్రం వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలను తనిఖీ చేపట్టారు. లైసెన్సు లేనివారికి జరిమానాలు విధించారు. వాహనదారులు రికార్డులను సక్రమంగా పెట్టుకోవాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలకు చెందిన రికార్డులు సరిగా లేకపోతే ఇబ్బందులు పడాల్సిన వస్తుందన్నారు. హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరగవని ఎస్ఐ పేర్కొన్నారు.

రేపటి నుంచి గౌరిదేవి కార్తీక మహోత్సవాలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన గౌరిదేవి ఆలయంలో సోమవారం నుంచి కార్తీక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 11న ఉదయం 10 గంటలకు కలశస్థాపన, గణపతిపూజ, పుణ్య వచనాలతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అర్చకులు శంకర మంచి ప్రసాద్ శర్మ నేతృత్వంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15న శుక్రవారం కార్తీకపౌర్ణమి వరకు గౌరిదేవి వివిధ ఆలంకరణలతో దర్శనమిస్తారన్నారు. శనివారం పసుపు ప్రతిమతో తయారు చేసిన గౌరిదేవి అమ్మవారును మఠం వీధిలో ఉన్న వృషభాచలేశ్వర స్వామి ఆలయానికి చెందిన పుష్కరిణిలో నిమజ్జనం చేస్తారని వివరించారు. 5 రోజుల పాటు ఉభయదారుల పూజలు ఉంటాయన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- బాలిక నిశ్చితార్థం ఆపిన అధికారులు

ప్రజాశక్తి - ముద్దనూరు

బాల్య, బలవంతపు వివాహాలు చట్టరీత్యా నేరమని తహశీల్దార్ వరద కిశోర్‌రెడ్డి, సిఐ దస్తగిరి తెలిపారు. మండలంలోని ఓ గ్రామంలో శనివారం పదహారేళ్ల బాలికకు బలవంతంగా తల్లిదండ్రులు నిశ్చితార్థం ఏర్పాటు చేశారని ఫిర్యాదు అందిందని వారు తెలిపారు. ఇలాంటి పెళ్లి చేస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేసే పెద్ద మనుషులు, తల్లిదండ్రులు, పూజారులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వీరభద్రపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నిరుపయోగంగా మారింది. మూడేళ్ల క్రితం విద్యార్థులులేరనే కారణంతో పాఠశాలను మూసేశారు. అప్పటి నుండి భవనాలు నిరుపయోగంగా మారాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాలను ఏర్పాటు చేసి నూతన భవనాలను నిర్మించింది. సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ భవనాలను రూ.85 లక్షలు వెచ్చించి నిర్మించింది. అధికారులు ముందుచూపుతో ఇలా నిరు పయోగంగా మారిన భవనాలను ప్రభుత్వ అవసరాలకు విని యోగించుకుంటే ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా ఉంటుంది. వీరభద్రపురంలో మూతపడిన పాఠశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



నిరుపయోగంగా ఉన్న వీరభద్రాపురం పాఠశాల



అన్నప్రసాద వితరణలో దాతలు

దాతృత్వం చాటుకున్న రైతు కుటుంబం

ప్రజాశక్తి - కొండాపురం

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని తనవంతు సహకారం అందించారు సంగిరెడ్డి హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు. కొండాపురం ప్రభుత్వ వైద్యశాలలో ఏడాది కాలంగా ప్రతినెలా రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం వసతి కార్యక్రమంలో భాగంగా శనివారం సంగిరెడ్డి హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు భోజనం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి ప్రతినెల వచ్చే గర్భిణులకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆర్‌సిడిఎస్ కొండాపురం శాఖ సభ్యులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి (ఓబులాపురం) కుటుంబం సభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ మహదేవరెడ్డి, లింగేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు దాతలకు అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న దుకాణాదారులు

కలుపు నివారణ మందు నిషేధాన్ని ఎత్తేయాలని వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కలుపు నివారణ మందు గ్లైపోసిట్ నిషేధాన్ని పులివెందుల ప్రాంతంలో ఎత్తేయాలని స్థానిక పురుగు మందుల దుకాణాల యజమానులు శనివారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారన్నారు. వ్యవసాయ పొలాల్లో గడ్డి నిర్మూలనకు కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయంగా రైతులు గ్లైపోసిట్ అనే కలుపు మందును వినియోగించేవారని తెలిపారు. ఈ మందును మన ప్రాంతంలో నిషేధించారన్నారు. అటు కూలీలు, ఇటు మందు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్సీకి వివరించారు. గ్లైపోసిట్ మందును అన్ని రాష్ట్రాలలో ఫర్టిలైజర్ దుకాణాల్లో అమ్ముతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని వారు ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ యజమానులు గురునాథరెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రఓబుల్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు దక్కడం హర్షణీయం

ప్రజాశక్తి - ఖాజీపేట



జనాబ్ మహమ్మద్ అహ్మద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఫరూక్

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించిన రెండో విడత నామినేటెడ్ పోస్టుల ప్రకటన జాబితాలో ముస్లిం మైనారిటీలకు కీలక పదవుల్లో చోటు దక్కడం పట్ల ఆ వర్గానికి చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎపి స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్, అడ్వయిజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(మైనారిటీ అఫైర్స్)గా జనాబ్ మహమ్మద్ అహ్మద్ షరీఫ్‌కు కీలక పదవులు దక్కాయి. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ సర్వర్‌ఖాన్ పేటకు చెందిన రాష్ట్ర మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్ సంతోషం వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవుల్లో మైనారిటీలకు పెద్ద ఎత్తున చోటు కల్పించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కష్టపడితే తప్పక న్యాయం జరుగుతుందనడానికి నామినేటెడ్ పదవులే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు



ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ బాబు ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ మిషన్ చైర్మన్‌గా ఎన్నికైన తమ అభిమాన నాయకుడు, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి హృదయపూర్వక శుభాభినందనలని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరి మల్లికార్జున శనివారం తెలిపారు. రైతుల పక్షాన నిలబడి అందరికీ అందుబాటులో ఉండాలని, భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని మల్లికార్జున ఆకాంక్షించారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానికంగా ఉన్న నాగార్జున ఐటిఐ సౌజన్యం, ఎజిపిహెచ్‌ఆర్ బెంగళూరు వారి సహకారంతో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నాగార్జున ఐటిఐ ప్రిన్సిపల్ సుబ్బారావు తెలిపారు. స్థానిక గీతాంజలి స్కూల్ గాంధీరోడ్డులో ఉదయం 9గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 50 ప్రముఖ కంపెనీలకు చెందిన 15,000 ఉద్యోగాలకు అవకాశం ఉందన్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, టాటా మోటర్స్, యెన్‌ఫీల్డ్, టివిఎస్‌తోపాటు వేర్‌హౌస్ కంపెనీలు (బెంగళూరు), ఆక్సిస్ బ్యాంకు (హైదరాబాద్)తోపాటు ప్రముఖ ఐటి, నాన్‌ఐటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి అధ్యక్షతన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సుబ్బారావు కోరారు.